

**రైతన్నా .. జాగ్రత్తన్నా...**
పంటకు ఆశించే చీడ పీడల నివారణకు రైతులు క్రిమి సంహారక మందు పిచికారీ చేస్తుంటారు. ఈ తరుణంలో రసాయనాల విషయంలో జాగ్రత్తలు పాటించడం అవసరం. -8లో



**గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్టు**
గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు సభ్యుల ముఠాను అరెస్టు చేసి వారి వద్ద ఐదు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ రాజగోపాల్ తెలిపారు. -8లో

గరిష్టం/కనిష్టం
36.3/25.3

**వాతావరణం**
జిల్లాలో గురువారం 25.3 – 36.3 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్

## న్యూస్‌రీల్

### కడప నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

**కడప కోటిరెడ్డిసర్కిల్:** పౌర్ణమిని పురస్కరించుకుని ఏపీఎస్ ఆర్టీసీ కడప డిపో నుంచి ఈనెల 17వ తేదీన సూపర్ లగ్జరీ, ఇంద్ర బస్సులను నడపనున్నట్లు డిపో మేనేజర్ ఢిల్లీశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. 6001 నంబరుగల సూపర్ లగ్జరీ బస్సులో పెద్దలకు రూ. 1072, పిల్లలకు రూ. 580 చార్జీగా ఉందన్నారు. 6002 నంబరుగల ఇంద్ర సర్వీసులో పెద్దలకు రూ. 1605, పిల్లలకు రూ. 850 ఛార్జీగా ఉంటుందన్నారు. ఈ బస్సుల్లో ఆన్‌లైన్ ద్వారా లేదా కడపలోని ఆర్టీసీ బస్టాండులోగల రిజర్వేషన్ కౌంటర్ ద్వారా కూడా టిక్కెట్లను రిజర్వు చేసుకోవచ్చన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### నేడు మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాక

**కడప కోటిరెడ్డిసర్కిల్:** రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ గుజ్జల వెంకటలక్ష్మి శుక్రవారం కడపకు రానున్నారు. ఈ విషయాన్ని ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. చైర్ పర్సన్ ఉదయం 9 గంటలకు స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్గొంటారన్నారు. అనంతరం మహిళా జైలులో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులో పాల్గొని మొక్కలు నాటుతారని, మహిళా ఖైదీలతో మాట్లాడుతారని తెలిపారు. అనంతరం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు చేరుకుని బాధిత మహిళల సమస్యలు తెలుసుకుని వారి ఫిర్యాదులను స్వీకరిస్తారన్నారు.

### ఉత్సాహంగా స్కూల్ గేమ్స్ ఎంపికలు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన రైఫిల్ షూటింగ్ క్రీడాకారులు

**ప్రొద్దుటూరు కల్చరల్:** ప్రొద్దుటూరులోని జార్జ్ కారొనేషన్ క్లబ్‌లో గురువారం స్కూల్‌గేమ్స్ ఎంపికలు జరిగాయి. అండర్–19 బాలబాలికల విభాగానికి సంబంధించి ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. బ్యాడ్మింటన్, ఫెన్సింగ్, రైఫిల్ షూటింగ్, యోగా ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. ఇందులో ప్రతిభ కనపరచిన క్రీడాకారులను త్వరలో జరుగునున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలని జార్జ్‌కారొనేషన్ క్లబ్ కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి శారద, సంయుక్త కార్యదర్శి విజయప్రసాద్‌రెడ్డి, బ్యాడ్మింటన్ అంతర్జాతీయ అంపైర్ జిలాని బాషా ఆకాంక్షించారు. పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు అరుణకుమారి, రాఘవ, చంద్రావతి, హసీనా తదితరులు పర్యవేక్షించారు.

### ఆరోగ్య కేంద్రం తనిఖీ

**పోరుమామిళ్ల:** రంగసముద్రం ఆరోగ్యకేంద్రాన్ని గురువారం జిల్లా మెడికల్ టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాతా శిశు సంరక్షణకు వైద్య సిబ్బంది తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. డీపీఎంఓ శశిభూషణ్‌రెడ్డి, స్టాటిస్టికల్ అధికారి రమేష్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది బాధ్యతతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు మేరీ ఎల్సా, కరిష్మా, ఆరోగ్య విద్యాధికారి సాధు వెంకటేశ్వర్లు, సీహెచ్‌ఓ నిర్మల, సరస్వతి, నాగమ్మ ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

### ఇ- పంట రిజిస్టర్‌ను సక్రమంగా నిర్వహించాలి



టక్కోలులో వేరు శనగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

**సిద్దవటం:** రైతు సేవా కేంద్రం సహాయకులు ఇ- పంట రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎ. నాగేశ్వరరావు పేర్కొన్నారు. సిద్దవటం మండలంలోని టక్కోలు రైతుసేవా కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు దస్త్రాలను పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఇ-పంట నమోదు ప్రక్రియను ఈనెల 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని తెలిపారు. అందుకోసం రైతులను అప్రమత్తం చేయాలన్నారు. ఈనెల 24 వతేదీ నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె. రమేష్ రెడ్డి, రైతు సేవా కేంద్రం సహాయకులు వంశీ, ఏపీసీఎస్‌ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



# పులివెందులపై పచ్చ పగ!

పుట్టిన గడ్డపై వారికి ఎనలేని మమకారం. అవకాశం వస్తే తరతమ భేదంలేకుండా సేవాతత్పరత చూపడం వారి నైజం. రాజకీయ ప్రత్యర్థుల ప్రాంతానికి సైతం సేవ చేసిన గుణం వారి సొంతం. ఈ సుగుణాలు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలో ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. అయితే ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు తద్భిన్నంగా వ్యవహరిస్తున్నారు. రాజకీయ ప్రత్యర్థితో పాటు, ఆ ప్రాంతంపై కూడా విషం కక్కుతున్నారు. మంజూరైన మెడికల్ సీట్ల భర్తీకి విముఖత చూపుతున్నారు. పులివెందుల అంటే ప్రత్యక్ష పగ చూపుతున్నారు.

- రూ.530కోట్లతో ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణం
- నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్
- 50 ఎంబీబీఎస్ కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ఎన్‌ఎంసీ
- ఈ ఏడాది భర్తీకి చొరవ చూపని చంద్రబాబు ప్రభుత్వం



పులివెందుల మెడికల్ కళాశాల

**సాక్షి ప్రతినిధి, కడప:** రాష్ట్ర ముఖ్యమంత్రిగా నిరుపేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే తపన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూపించారు. ఆంధ్రప్రదేశ్‌లో 17 మెడికల్ కళాశాలలను నిర్మించారు. ఈక్రమంలో పులివెందులలో ఏపీఎంఎస్ ఐడీసీ (ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ద్వారా రూ.530కోట్లతో ప్రభుత్వ మెడికల్ కళాశాలను నిర్మించారు. పార్లమెంట్ పరిధిలో ఒక మెడికల్ కళాశాల నిర్మించాలనే సంకల్పంతో పులివెందులలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు 2020 డిసెంబర్ 2న వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. 50 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 627 పడకలు వసతి గల ఆస్పత్రి నెలకొల్పారు. ఏడాదికి 150 మెడికల్ సీట్లు, 60 నర్సింగ్ సీట్లల్లో విద్యను అభ్యసించేలా వసతులు సమకూర్చారు. జీ ప్లస్ 3గా నిర్మించిన ఈ భవనాలు సరాసరిగా ఒక్కో ఫ్లోర్ 37,300 చదరపు అడుగులతో చేపట్టారు. ఆ మేరకు ఎంసీఐ బృందం స్వయంగా భవనాలు, అందుబాటులో ఉన్న వసతులను ప్రత్యక్షంగా పరిశీలించింది. గత ఏడాది జూలై 31న వర్చువల్ విధానంలో మరోమారు తనిఖీలు చేపట్టి అనుమతులు జారీ చేసింది.

**మెడికల్ కళాశాలకు 50సీట్ల కేటాయింపు**

పులివెందుల మెడికల్ కళాశాల అన్నీ అనుమతులు సాధించింది. సోమవారం డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాలకు 50సీట్లు కేటాయిస్తూ ఎన్‌ఎంసీ ఆగస్టు 5న ఉత్తర్వులు జారీ చేసింది. మౌలిక వసతులన్నీ ఉన్నా, కళాశాల ఫ్యాకల్టీ, పెండింగ్ పనులను దృష్టిలో పెట్టుకొని 50సీట్లు మాత్రమే కేటాయించింది. పెండింగ్ పనులు పూర్తి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం నుంచి అండర్ టేకింగ్ లెటర్ కోరింది. ఆ లెటర్ ఇచ్చేందుకు చంద్రబాబు సర్కార్ విముఖత చూపడం గమనార్హం. దీంతో ఎన్‌ఎంసీ కేటాయించిన 50 ఎంబీబీఎస్ సీట్లు రద్దు చేసుకోవాల్సిందిగా ప్రత్యుత్తరం రాయడం విశేషం. కేటాయించిన సీట్లు కంటే మరీన్ని సీట్లు అదనంగా కావాలని కోరే ప్రభుత్వాలు చరిత్రలో చూశాం. మంజూరైన మెడికల్ సీట్లును తిరస్కరించిన ఏకైక సర్కార్ ఇదేనని పలువురు వాపోతున్నారు.

### వైఎస్ హయాంలో కుప్పం దాహార్తి తీర్చేందుకు కృషి



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి అభివృద్ధి విషయంలో తరతమ భేదం లేదని తేల్చి చెప్పేందుకు అనేక ఉదాహరణలున్నాయి. అప్పటి విపక్షనేత, ప్రస్తుత సీఎం నారా చంద్రబాబునాయుడు నియోజకవర్గం కుప్పం కూడా ఓ ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోంది. అక్కడి ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రూ.52 కోట్లతో పాలారు రిజర్వాయర్ మంజూరు చేశారు. కర్ణాటక రాష్ట్రంలో ప్రారంభమై కుప్పం మీదుగా తమిళనాడుకు వెళ్లే పాలారు నదిపై రిజర్వాయర్ నిర్మించి కుప్పం నియోజకవర్గానికి తాగు, సాగునీరు అందించే బృహత్తర పథకానికీ శ్రీకారం చుట్టారు. తర్వాత తమిళనాడు ప్రజలతో కొందరు కోర్టులో కేసు వేయించడంతో అప్పట్లో ఆ పనులు పెండింగ్‌లో పడ్డాయి. తర్వాత 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కాలువ ద్వారా కుప్పం నియోజకవర్గానికి నీరు ఇచ్చారు. శాంతిపురం, రామకుప్పం చెరువులకు నీటితో నింపి పెద్ద మనుస్సు చాటుకున్నారు. కాగా ప్రస్తుతం పులివెందుల మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీట్లు భర్తీ చేసేందుకు మాత్రము చంద్రబాబుకు మనస్సు సుతారాము అంగీకరించడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా పులివెందుల పంచాయతీ, రాజారెడ్డి రాజ్యాంగం అంటూ ప్రాంతంపై విషం కక్కడం సర్వసాధారణమైంది. ముఖ్యమంత్రిగా మరోమారు అదే విషయాన్ని తెరపైకి తెచ్చారు. కాగా ఉన్న అవకాశాన్ని కోల్పోతున్నామని మెడికల్ విద్యార్థులు, తల్లిదండ్రులు వాపోతున్నారు.

**ప్రవేశాలు కల్పించాలి**



పులివెందుల మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలి. ఎంతో చక్కగా తీర్చి దిద్దిన భవనాల్లో ఏర్పాటైన కళాశాలలో ప్రవేశాలకు ఎన్‌ఎంసీ అనుమతులు ఇచ్చినా ప్రారంభించకపోవడం సరికాదు. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని ఈ ఏడాది పులివెందుల మెడికల్ కళాశాలలో ప్రవేశాలు కల్పించాలి. – ఆచార్య జి. గులాంతారీఖ్, విశ్రాంత ఆంగ్లశాఖ ఆచార్యులు, వైవీయూ

**వివక్ష సరికాదు**



ప్రభుత్వాలు ఏవైనా విద్యా పరంగా అభివృద్ధికి సంబంధించిన విషయాల్లో వివక్ష సరికాదు. ఇలాంటి నిర్ణయాల వల్ల పేద, మధ్య తరగతికి చెందిన పిల్లలకు అన్యాయం జరిగే అవకాశం ఉంటుంది. ప్రస్తుత ఎన్‌డీఏ ప్రభుత్వం పులివెందుల మెడికల్ కళాశాలకు అండర్ టేకింగ్ లెటర్ ఇచ్చి ఉంటే 50 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరి ఉండేది.
– గంగిరెడ్డి నాగిరెడ్డి, బి. కొత్తపల్లి, మైదుకూరు

**ఫ్యాకల్టీ, వసతులున్నా..**



పులివెందుల మెడికల్ కళాశాలకు ఎన్‌ఎంసీ అనుమతి ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం సీట్ల భర్తీకి విముఖత చూపడంతో విద్యార్థులకు అన్యాయం జరగనుంది. ఈ కళాశాలకు ఫ్యాకల్టీ, వసతులున్నా పెండింగ్ పనులు పూర్తి చేస్తామని ప్రభుత్వం అండర్ టేకింగ్ లెటర్ ఇవ్వకపోవడంతో విద్యార్థుల కల నెరవేరకుండా పోయింది. – లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎగువపల్లి, వల్లూరు

# గంజాయి నిర్మూలనకు చర్యలు

**సిబ్బందికి కర్నూలు రేంజ్ డీఐజీ కోయప్రవీణ్ ఆదేశం**



మాట్లాడుతున్న డీఐజీ కోయప్రవీణ్

**బద్వేలు అర్బన్:** స్థానిక బద్వేలు అర్బన్ పోలీసుస్టేషన్‌ను గురువారం కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో భాగంగా స్టేషన్ పరిసరాలు, పోలీసుస్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, కేసుల దర్యాప్తు తదితర అంశాలతో పాటు రికార్డులను పరిశీలించారు.గంజాయి నిర్మూలనకు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు గట్టి చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. చోరీల నియంత్రణకు నైట్‌బీట్ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. పాత నేరస్తులపై నిఘా ఉంచి నేరాల నియంత్రణకు కృషి చేయాలని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా మెలిగి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అనంతరం గోపవరం మండల పరిధిలోని సెంచురీ పానెల్స్ పరిశ్రమను పరిశీలించారు. ఆయన వెంట మైదుకూరు డీఎస్పీ జి.రాజేంద్రప్రసాద్, అర్బన్, రూరల్ సీఐలు రాజగోపాల్, నాగభూషణం, ఎస్‌ఐలు సత్యనారాయణ, రవికుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రాంతం పట్ల అవగాహన కోసమే పర్యటన**

**పోరుమామిళ్ల:** కడప జిల్లా పట్ల అవగాహన పెంచుకొనేందుకే బద్వేలు, పోరుమామిళ్ల ప్రాంతాల్లో పర్యటిస్తున్నానని కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ చెప్పారు. గురువారం ఆయన పోరుమామిళ్ల పోలీస్‌స్టేషన్ సందర్శించారు. ఆయన వెంట మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. డీఐజీకి సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ కొండారెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం కర్నూలు రేంజ్ డీఐజీ రికార్డులను పరిశీలించారు.అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటివరకు సర్కార్ (ఉత్తరాంధ్ర) ప్రాంతంలోనే విధులు నిర్వహించానని, రాయలసీమలో పని చేస్తున్నందున ఈ ప్రాంతం గురించి తెలుసుకొంటే విధి నిర్వహణకు అనువుగా ఉంటుందనే భావనతో వచ్చానని తెలిపారు.

# ప్రయాణీకులకు మెరుగైన సేవలు



మాట్లాడుతున్న ఈడీ చెంగల్‌రెడ్డి

**కడప కోటిరెడ్డిసర్కిల్:** ఆర్టీసీ ప్రయాణీకులకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని ఆర్టీసీ కడపజోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చెంగల్‌రెడ్డి తెలిపారు. గురువారం ఇక్కడ విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రయాణీకులను సురక్షితంగా వారివారి గమ్యస్థానాలకు చేర్చేందుకు వీలుగా బస్సుల కండీషనతోపాటు బస్సుల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు.

- అక్టోబర్‌లో తిరుమల బ్రహ్మోత్సవాలు జరగనున్న తరుణంలో జోన్ వ్యాప్తంగా అన్ని డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు నడుస్తాయన్నారు. అలాగే రానున్న దసరా పండుగ సందర్భంగా కూడా ప్రత్యేక బస్సులు నడిపేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఇటీవల పుట్టపర్తి నుంచి అయోధ్యకు బస్సులు నడిపామన్నారు. అదే తరహాలో రాయలసీమ వ్యాప్తంగా గల మిగతా డిపోల నుంచి కూడా అయోధ్యకు బస్సులు పంపేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

# స్వచ్ఛ భారత్ లక్ష్యం కోసం చిత్తశుద్ధితో పనిచేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

**కలెక్టర్ శివశంకర్ లోతేటి**

**కడప సెవెన్‌రోడ్స్:** స్వచ్ఛ భారత్ లక్ష్యం కోసం చిత్తశుద్ధితో పనిచేయాలని, జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర రాజధాని నుంచి.. అక్టోబర్ 2న స్వచ్ఛ భారత్ దివస్ సందర్భంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలపై రాష్ట్ర ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సమావేశానికి స్థానిక కలెక్టరేట్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి హాజరయ్యారు. సీఎస్ వీసీ ముగిసిన అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా యంత్రాంగం మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల ద్వారా చేపడుతున్న పారిశుద్ధ్య నిర్వహణ చర్యలను ప్రతిఒక్కరూ తప్పక పాటించాలని కోరారు. స్వభావ్ స్వచ్ఛత, సంస్కార్ స్వచ్ఛత అనే నినాదంతో ఈనెల 17 నుంచి అక్టోబర్ ఒకటో తేదీ వరకు వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. గ్రీన్ అంబాసిడర్‌ల విధులను గౌరవిస్తూ.. అక్టోబర్ రెండో తేదీన వారికి అవార్డులు ప్రదానం చేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో గంగాధర్ గౌడ్, జెడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి, డీపీఓ ప్రభాకర్ రెడ్డి, సీపీవో వెంకట్రావు, డీఈవో అనువాద, డీఎంహెచ్‌ఓ డా. నాగరాజు, సోషల్ వేల్ఫేర్ డీడీ సరస్వతి, జిల్లా టూరిజం అధికారి సురేష్ కుమార్, ఎలీడీఎం జనార్దనం తదితరులు పాల్గొన్నారు.

# చదువుల కోవెలకు అక్షర హారతి

రాయలసీమ ప్రాంత యువతకు ఉన్నత విద్య నందించాలన్న లక్ష్యంతో 1948లో ఏర్పాటైన కళాశాలకు.. 1952లో అప్పటి ముఖ్యమంత్రి సర్ సీవీ రాజగోపాలాచారి చేతుల మీదుగా పునాదిరాయి వేయగా, 1955లో మద్రాసు విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ లక్ష్మణస్వామి మొదలియార్ చేతుల మీదు ప్రారంభమై.. ఆకట్టుకునే భవన నిర్మాణాలతో ఆర్ట్స్ కళాశాలగా రూపుదిద్దుకుంది. 75 సంవత్సరాల కాలంలో ఎన్నో లక్షల మంది విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, ఎమ్మెల్యేలు, మంత్రులుగా తీర్చిదిద్దిన చదువుల కోవెల నేడు 75 సంవత్సరాల ప్లాటినం జూబ్లీ వేడుకలకు సిద్ధమైన వేళ ప్రత్యేక కథనం.

- నేడు, రేపు ఆర్ట్స్ కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలు
- పూర్వ విద్యార్థుల కృషితో రూ. 50 లక్షలతో అభివృద్ధి పనులు పూర్తి
- అందుబాటులోకి రవీంద్రనాథ్ ఠాగూర్ ఆడిటోరియం
- తరలిరానున్న పూర్వ విద్యార్థులు




కడప ఆర్ట్స్ కళాశాల (ఇన్‌సెట్) కళాశాలలో ఏర్పాటు చేసిన 75 సంవత్సరాల ప్లాటినం జూబ్లీ పైలాన్

**వైవీయూ:** ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ప్రభుత్వంలో 1948లో ఏర్పాటైన విద్యాలయం దాదాపు 75 సంవత్సరాల పాటు రాయలసీమ ప్రాంత ప్రజలకు విద్యాసుగంధాలు వెదజల్లుతూనే ఉంది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం అనుబంధంతో ఏర్పాటైన కడప ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్స్) కళాశాలగా ప్రారంభమైంది. అనంతరం 1968లో శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయానికి, 2008లో కడప యోగి వేమన విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉండేది. 2012–13లో స్వయంప్రతిపత్తి సాధించి అటానమస్ హోదాతో ప్రతిఏటా దాదాపు 2వేల మందికిపైగా విద్యార్థులకు సేవలందిస్తోంది.

**న్యాక్ గ్రేడింగ్ సాధించిన తొలి కళాశాల ఆర్ట్స్ కళాశాల**

జిల్లాలో 2003–04లో తొలుత న్యాక్ అసెస్‌మెంట్ బీ ప్లస్ ప్లస్ గ్రేడ్ సాధించిన కళాశాల ప్రభుత్వ పురుషుల కళాశాల, కడప. అదే విధంగా తొలిసారిగా అటానమస్ హోదాను సాధించింది ఇదే కళాశాల కావడం గమనార్హం. 2011లో అటానమస్ హోదాను పొందిన కళాశాల ఈ హోదాను 2015–16 వరకు కొనసాగింది. 2012–13 నుంచి కళాశాలలో పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం, ఫలితాల విడుదల, సిలబస్ రూపకల్పన ఇలా మొత్తం స్వయంప్రతిపత్తిగా వ్యవహరించింది. మళ్లీ ఈ ఏడాది 2020–21 విద్యాసంవత్సరం నుంచి 2025–26 విద్యాసంవత్సరం వరకు అటానమస్ హోదాను పొందేందుకు కళాశాల సన్నద్ధమైంది.

**2000 చెట్లు ఉన్న ఏకైక ప్రాంతం..**

కడప నగరంలో దాదాపు 2వేలకు పైగా చెట్లతో పచ్చదనం, చల్లదనం అందించే ఏకైక ప్రాంతం ఆర్ట్స్ కళాశాలే కావడం విశేషం. కళాశాలలోని ప్రతి చెట్టుకు ఒక నంబర్ ఇవ్వడంతో పాటు ఆ చెట్టు శాస్త్రీయనామాలను ఏర్పాటు చేసేయత్నాలు ప్రారంభించారు. దీంతో పాటు 75 సంవత్సరాల ప్లాటినం జూబ్లీ వేడుకల గుర్తుగా పైలాన్‌ను ఏర్పాటు చేశారు.

**రూ. 50 లక్షల నిధులతో అభివృద్ధి పనులు..**

తాము చదివిన కళాశాలకు కొంతైనా చేయాలన్న తలంపుతో పూర్వ విద్యార్థుల సంఘాన్ని ఏర్పాటు చేసి కళాశాల అభివృద్ధికి నడుం బిగించారు. దాదాపు 50 లక్షల మేర నిధులు సేకరించడంతో పాటు కళాశాలలోని రవీంద్రనాథ్ ఠాగూర్ ఆడిటోరియాన్ని ఆధునికీకరించారు. సెమినార్ హాల్‌లో నూతన ఫర్నీచర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు.

### నేటి కార్యక్రమాలు..

- శుక్రవారం ఉదయం 7 గంటలకు కడప నగరంలోని మానస ఇన్ హోటల్ సమీపం నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు 2 కే రన్ నిర్వహణ.
- ఉదయం 9.45 గంటలకు ప్లాటినం జూబ్లీ వేడుకలు ప్రారంభం. హాజరుకానున్న జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, కడప ఎమ్మెల్యే ఆర్. మాధవిరెడ్డి, కళాశాల విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్, విశ్రాంత చీఫ్ సెక్రటరీ డాక్టర్ కె.ఎస్. జవహర్‌రెడ్డి, కేంద్ర స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ పూర్వపు డైరెక్టర్ బి.ఎల్.ఎస్. ప్రకాష్‌రావు, ఇతర అతిథుల చేతుల మీదుగా వేడుకలు ప్రారంభం.
- సాయంత్రం 6 గంటలకు 'పద్మ శ్రీనివాసం '(డివైన్ వెడ్డింగ్) శాస్త్రీయ నృత్య ప్రదర్శన.

1952లో సర్ సీవీ రాజగోపాలాచారి చేతుల మీదుగా ఆవిష్కరించిన పునాదిరాయి




కళాశాల ఏర్పాటు: **1948**

పునాదిరాయికి శిలాఫలకం ఆవిష్కరణ: **1952** జూన్ **14**

2 (ఎఫ్), 12 (బి) హోదా: **1967**

జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల వేర్వేరు భవనాల కేటాయింపు: **1996**


బి ప్లస్‌ప్లస్ గ్రేడింగ్: **2003-04**

తొలిసారిగా అటానమస్ హోదా : **2011** నవంబర్

2.76 జీపీఏతో న్యాక్ బి గ్రేడ్: **2013**

మరోసారి న్యాక్ బి గ్రేడ్: **2019**

**విజయవంతం చేయాలి**



75 సంవత్సరాల ప్లాటినం జూబ్లీ వేడుకలను విద్యార్థులు, పూర్వ విద్యార్థులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలి. ఇక్కడ చదివిన ఎందరో ఉన్నతస్థానాల్లో ఉన్నారు. వారందరూ ఈ వేడుకలకు వస్తున్నారు. సంబరాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. – డా. జి. రవీంద్రనాథ్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ పురుషుల కళాశాల, కడప

# రైతన్నా.. జాగ్రత్తన్నా...

- ఎరువుల వాడకంలో అధికారుల సూచనలు ముఖ్యం
- పురుగు మందు పిచికారీలో నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ముప్పు

**పంటకు చీడ పీడల బెడద తగ్గించేందుకు పురుగుల మందు పిచికారీ తప్పనిసరి. రైతు తమకు తోచిన దుకాణ దారు వద్ద ఏదో పురుగు మందు కొనుగోలు చేసి పంటను రక్షించుకునేందుకు పిచికారీ చేస్తున్నారు. అయితే మందుల కొనుగోలు విషయంలోనూ.. పిచికారీ విషయంలోనూ జాగ్రత్తలు పాటించకపోతే అటు పంటకు.. ఇటు రైతుకు ప్రమాదం తప్పదని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. తెగుళ్ల సమాచారం అధికారుల దృష్టికి తీసుకువచ్చి వారి సూచనలు పాటిస్తే ప్రమాదం నుంచి గట్టెక్కవచ్చని చెబుతున్నారు.**

**కడప అగ్రికల్చర్ :** కడపలో ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు వ్యవసాయ పనులు ముమ్మరం చేశారు. పెన్నా, కుందూ నది పరివాహక ప్రాంతాలతో పాటు ప్రాజెక్టులు, కేసీ కెనాల్, బోర్ల కింద వరి పంట విస్తారంగా సాగు చేస్తున్నారు. ఇటీవల వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల దృష్ట్యా అక్కడక్కడా సాగు చేసిన వరి, ఆరుతడి పంటలకు తెగుళ్ల సోకడంతో రైతులు పురుగు మందులు పిచికారీకి సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో తగిన జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. నకిలీ పురుగు మందుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, చీడపీడలు, తెగుళ్ల నియంత్రణకు వినియోగించే పురుగు మందు డబ్బాపై వజ్రాకారంలో అత్యంత విష పూరితమైతే నీలం, తక్కువ విషపూరితమైతే ఆకుపచ్చ గుర్తులు ఉంటాయని వ్యవసాయ శాఖ గుర్తింపు పొందిన దుకాణాల్లోనే పురుగు మందులు కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చి వారి సూచన మేరకు మందులు వాడాలని హెచ్చరిస్తున్నారు.

**రసాయనాలతో జాగ్రత్త...**

పంటకు ఆశించే చీడ పీడల నివారణకు రైతులు క్రిమి సంహారక మందు పిచికారీ చేస్తుంటారు. ఈ తరుణంలో రసాయనాలతో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. గుండె జబ్బులు, కళ్లు తిరగడం, వాంతులు, క్యాన్సర్, నరాల బలహీనత వంటి సమస్యలకు లోనయ్యే అవకాశం ఉంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పిచికారీ చేసే వ్యక్తులకేగాక మందుల వాడకం అవశేషాలతో పండించే పంట ఉత్పత్తులపై చాలాకాలంగా ఉండి వినియోగించే ప్రతి ఒక్కరూ అనారోగ్యానికి లోనయ్యే ప్రమాదం ఉంటుందని చెబుతున్నారు. విచక్షణా రహితంగా పురుగు మందులు వినియోగిస్తే కీటకాలు వ్యాధి నిరోధక శక్తిని పొందడంతో పంటకు నష్టం వాటిల్లుతుంది. ప్రకృతి వ్యవసాయం చేస్తే మనుషులేగాక నేల కూడా ఆరోగ్యంగా ఉంటుంది. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడమేగాక, ఆరోగ్యకర పంట ఉత్పత్తులు పొందవచ్చు. పశువుల పేడ, వేపాకు కషాయం, పచ్చిరొట్ట ఎరువులు, వర్మి కంపోస్టు వినియోగంచడంతో భూసారం పెరుగుతుంది,



వరి పంటకు పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

**పిచికారీ విషయంలో జాగ్రత్తలు అవసరం**

- మందులు పిచికారీ చేసే సమయంలో శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచేలా దుస్తులు ధరించాలి. ముఖానికి మాస్కు, చేతులకు గ్లౌజు వేసుకోవాలి. పిచికారీ సమయంలో భోజనం చేయడం, నీరు తాగడం, సిగరెట్, బీడీ కాల్చడం వంటి పనులు చేయరాదు.
- పురుగు మందులు కలిపేటప్పుడు చేతులతో కాకుండా కర్రలతో కలపడం శ్రేయస్కరం. ఆహార పదార్థాలతో కలిసి కీటక నాశన మందులను రవాణా చేయరాదు.
- ఇళ్లలో పురుగు మందు డబ్బాలను పిల్లలకు అందుకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అంతేగాక వాటికంటూ ప్రత్యేక స్థలాన్ని కేటాయించి భద్రపరచుకోవాలి.
- పురగుమందుల డబ్బాలపై రంగు ముద్రలు పరిశీలించాలి, గాలి వీచే దశలోనే మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలి.
- పురుగుమందు పిచికారీ యంత్రాలకు సంబంధించిన నాజిల్స్‌ను శుభ్రపరచడానికి నోటితో గాలిని ఊదడం అత్యంత ప్రమాదకరం. ప్రమాదవశాత్తూ మందు కళ్లలో పడితే వెంటనే మంచి నీటితో శుభ్రంచేసుకోవాలి.
- కీటకనాశక మందుల పిచికారీ తర్వాత ఖాళీ డబ్బాలను గొయ్యి తీసి పూడ్చిపెట్టాలి, ఇతర అవసరాలకు వాడొద్దు. – ప్రమాదవశాత్తూ విష ప్రభావానికి గురైతే ప్రథమ చికిత్స అందించి తక్షణమే ఆసుపత్రికి తరలించాలి. వాడిన మందు వివరాలు వైద్యులకు తెలియజేయాలి.
- పిచికారీ పూర్తయిన వెంటనే స్ప్రేయర్ బయట, లోపల శుభ్ర చేసి ఆరబెట్టుకోవాలి. తిరిగి వాడుకునే ముందు ఆయిల్ పట్టించుకోవాలి.

**శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు పాటించాలి**



పంట పొలాల్లో చీడ, పీడల నివారణకు శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలి. నాణ్యమైన ఎరువు, పురుగుల మందులను మాత్రమే వాడుకోవాలి. మందు పిచికారీ చేసేటప్పుడు తప్పని సరిగా రక్షణ దుస్తులు, ముఖానికి మాస్కు చేతులకు గ్లౌజు వేసుకుని అన్ని జాగ్రత్తలను పాటిస్తూ పిచికారీ చేసుకోవాలి.

– అయితా నాగేశ్వరావు, జిల్లా వ్యవసాయాధికారి.

## క్లుప్తంగా

### త్రుటిలో తప్పిన ప్రమాదం..



గండికోట రహదారిలో అదుపు తప్పిన పాఠశాల బస్సు

**జమ్మలమడుగు రూరల్ :** పట్టణంలోని సరస్వతి హైస్కూల్‌కు చెందిన విద్యార్థుల బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. వైఎస్సార్ జిల్లా గండికోట గ్రామానికి చెందిన 32 మంది విద్యార్థులను తీసుకుని సరస్వతి హైస్కూల్ బస్సు జమ్మలమడుగుకు బయలుదేరింది. మార్గమధ్యంలో వాహనం అదుపు తప్పింది. అయితే డ్రైవర్ బస్సును కుడి వైపునకు మళ్లించడంతో ప్రమాదం తప్పింది. పోలీస్ అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఏ ప్రమాదం జరగలేదని తెలిసి విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

### బెల్ట్ షాప్ నిర్వాహకుడు అరెస్ట్



మందు సీసాలు స్వాధీనం చేసుకుని గంగాధరరెడ్డిని అరెస్టు చేసిన ఎస్‌ఐ

**సింహాద్రిపురం :** మండలంలోని అంకాలమ్మ గూడూరు గ్రామానికి చెందిన కానాల గంగాధర్ రెడ్డి తన ఇంటి వద్ద బెల్ట్ షాప్ నిర్వహిస్తుండగా గురు వారం తనిఖీ చేసి పట్టుకున్నట్లు ఎస్సై తులసీనాగప్రసాద్ తెలిపారు. అతని ఇంటిని సోదా చేయగా 27 క్వార్టర్ల మందు సీసాలు లభ్యమయ్యాయని, గంగాధర్‌రెడ్డిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### చెప్పకుండా.. ఆర్బీకేను కూల్చేశారు

**ప్రొద్దుటూరు :** అధికారులకు సమాచారం ఇవ్వకుండా చెన్నమరాజుపల్లె గ్రామంలో నిర్మాణంలో ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని కూల్చేశారని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు నాగేశ్వర రావు తెలిపారు. గత నెల 26న సాక్షి దినపత్రికలో 'రైతు భరోసా కేంద్రం కూల్చివేత' వార్తకు ఆయన స్పందించారు. రైతు భరోసా కేంద్రానికి కేటాయించిన స్థలం గతంలో తనదని శ్రీనివాసులు చెప్పగా, పునాదులు తీసిన తర్వాత అదే గ్రామానికి చెందిన సురేష్ ఆ స్థలం తనదని కోర్టును ఆశ్రయించారని తెలిపారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా జేసీబీతో సురేష్ నిర్మాణాన్ని కూల్చివేశారని, దానిపై ఇంజనీరింగ్ అసిస్టెంట్ పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు.

## 15 నుంచి స్కీం వర్కర్లకు రాష్ట్ర స్థాయి శిక్షణ



మాట్లాడుతున్న జె.లలితమ్మ

**ప్రొద్దుటూరు :** ఈ నెల 15, 16వ తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం పథకంతోపాటు ఇతర స్కీం వర్కర్లకు రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు స్కీం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకురాలు జె.లలితమ్మ తెలిపారు. స్థానిక ఎన్‌జీఓ హోంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గురువారం ఆమె మాట్లాడుతూ ప్రొద్దుటూరులో జరిగే శిక్షణ తరగతులకు మహిళా నేతలు హాజరవుతారన్నారు. గత 30 ఏళ్లుగా పనిచేస్తున్న వారికి కనీస వేతనాలు అందడంలేదని, మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు మంజుల, విజయ, సుజాత, చంద్రిక, పద్మావతి, గౌసియా పాల్గొన్నారు.

## ఆడిటర్ల సమస్యలను పరిష్కరించాలి

– స్వంత భవన ఏర్పాటుకు స్థలం కేటాయించాలి
– ఏపీటీపీ సీఏ రాష్ట్ర ముఖ్య సలహాదారు షరీఫ్‌ఖాన్




మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ టాక్స్ ప్రాక్టీషనర్స్ కన్సల్టెన్సీ అసోసియేషన్ ముఖ్య సలహాదారు పఠాన్ షరీఫ్ ఖాన్


**కడప కోటిరెడ్డిసర్కిల్ :** రాష్ట్రంలో ఆడిటర్స్, టాక్స్ ప్రాక్టీషనర్స్, కన్సల్టెన్సీ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టాక్స్ ప్రాక్టీషనర్స్ కన్సల్టెన్సీ అసోసియేషన్ ముఖ్య సలహాదారు పఠాన్ షరీఫ్ ఖాన్ కోరారు. గురువారం కడపలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో షరీఫ్ ఖాన్ మాట్లాడుతూ అసోసియేషన్ భవన నిర్మాణానికి జిల్లాల్లో ఐదు సెంట్ల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కార్యదర్శి జయకృష్ణ మాట్లాడుతూ అసోసియేషన్ ద్వారా వృత్తి సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. అందుకే అవగాహన సదస్సుల ద్వారా సందేహాలు నివృత్తి అవుతాయని వివరించారు.

**నూతన కమిటీ :** అనంతరం వైఎస్సార్ అన్నమయ్య జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా పోసా మల్లికార్జున, ఉపాధ్యక్షులుగా గండికోట శివకుమార్, కార్యదర్శిగా జయకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శిగా వడ్డీ నాగరాజు, అష్రఫ్ అలీఖాన్, పఠాన్ తౌహీద్ ఖాన్, కోశాధికారిగా శ్రీనివాసులు, ఈసీ మెంబర్స్ ఎన్నుకున్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వరదరాజులు, చంద్రశేఖర్, శివకుమార్, గౌరవాధ్యక్షులు కుమార్, చంద్రమౌళి, శ్రీనివాసరావు, సత్యనారాయణ రాజు, ఆదినారాయణ రెడ్డి, ఆడిటర్స్, టాక్స్ ప్రాక్టీషనర్స్, లయన్ పఠాన్ మన్సూర్ అలీ ఖాన్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.


### ఇద్దరు పోలీసులపై సస్పెన్షన్ వేటు

**కొండాపురం :** జిల్లాలోని తాళ్ల ప్రొద్దుటూరు పోలీస్ స్టేషన్‌లో విధుల్లో నిర్లక్ష్యం వహించి.. హెడ్ కానిస్టేబుల్, మరో కానిస్టేబుల్ క్రమశిక్షణ ఉల్లంఘించిన వ్యవహారంపై జిల్లా ఎస్పీ ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు తీవ్రంగా స్పందించారు. పోలీస్ స్టేషన్‌లో పోలీసుల బాహా బాహీ శీర్షికన సాక్షిలో గురువారం ప్రచురితమైన కథనంపై ప్రాథమిక విచారణ అనంతరం హెడ్‌కానిస్టేబుల్( హెచ్.సి1379) జి.వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ జి.గంగాధర్‌బాబు( పి.సి 563)లను సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

### రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి



మృతి చెందిన ఆటో డ్రైవర్ ఎస్.బాషా



గాయపడిన పవన్‌కుమార్‌రెడ్డి

**పీలేరు రూరల్ :** ఆటో–ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతిచెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన స్థానిక తిరుపతి రోడ్డులో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై వివరాల మేరకు.. కేవీపల్లె మండలం మద్దివాండ్లపల్లె పంచాయతీ ఒంటిల్లుకు చెందిన పవన్‌కుమార్‌రెడ్డి, పీలేరు పట్టణం బండ్లవంకకు చెందిన టి.విశాల్ ద్విచక్రవాహనంలో తిరుపతి వైపు వెళ్తున్నారు. ఇందిరమ్మ కాలనీకి చెందిన డ్రైవర్ ఎస్.బాషా ఆటో, ద్విచక్ర వాహనం ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సాయంతో పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ ఎస్. బాషాను, పవన్‌కుమార్‌రెడ్డిని తిరుపతికి తరలిస్తుండగా ఎస్.బాషా మార్గం మధ్యంలో మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు.

## వైఎస్సార్‌సీపీ నాయకుడిపై కూటమి నేతల దాడి



హనుమంతరెడ్డిని పరామర్శిస్తున్న గిరిధర్‌రెడ్డి

**జమ్మలమడుగు :** వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు పట్టణంలోని కెనరా బ్యాంకుసమీపంలో వైఎస్సార్ సీపీ నాయకుడు పెద్దగండ్లూరు గ్రామానికి చెందిన హనుమంతురెడ్డిపై కూటమికి చెందిన శ్రీనివాసులు రెడ్డి, మరో ఆరుగురు గురువారం దాడి చేశారు. బాధితుడి కథనం మేరకు.. 2018లో హనుమంతరెడ్డి స్వగ్రామం పెద్దగండ్లూరులో మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి వర్గీయులు హనుమంతరెడ్డి ఇంటిపై దాడి చేసి ఆస్తులు ధ్వంసం చేయడమేగాక, స్కార్పియో వాహనాన్ని పగులకొట్టారు. ఈ సంఘటనలో అప్పట్లో ఆదినారాయణరెడ్డి వర్గీయులపై పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి ఈ కేసు విషయంలో రాజీ పడాలని ఆదినారాయణరెడ్డి వర్గీయులు హనుమంతరెడ్డిని పదే పదే హెచ్చరిస్తూ వచ్చారు. గురువారం కేసు విచారణకు హనుమంతరెడ్డి వచ్చి వెళ్తుండగా కోర్టుకు కూతవేటు దూరంలో కూటమి నేత శ్రీనివాసులురెడ్డి, మరో ఆరుగురు కలిసి తనపై దాడి చేసినట్లు హనుమంతరెడ్డి తెలిపారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి, ఆయన సోదరుడు గిరిధర్‌రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి హనుమంతరెడ్డిని పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి ఫోన్‌లో బాధితుడితో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోర్ట్ విచారణకు వచ్చి పోతున్న హనుమంతరెడ్డిపై దాడి చేయడం తగదన్నారు. ఇది వరకే జమ్మలమడుగు ఇన్‌ఛార్జి డీఎస్పీ భక్త వత్సలం, సీఐ లింగప్పతో మాట్లాడినట్లు వారు తెలిపారు. దాడి చేసిన వారిని శిక్షించాలని కోరారు.

## 115 జీవోను రద్దు చేయాలి

**రిమ్స్‌లో మూడో రోజుకు చేరిన రిలే దీక్షలు**



రిమ్స్ ఆవరణలో జరిగిన రిలే దీక్షలలో పాల్గొన్న కాంట్రాక్ట్ నర్సింగ్ ఉద్యోగినులు

**కడప అర్బన్ :** రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్ట్ నర్సింగ్ వ్యవస్థను ఇబ్బంది పెట్టేలా ఉన్న 115 జీవోను రద్దు చేయాలని ఎన్.ఎస్.సి జిల్లా అధ్యక్షురాలు బి.విజయశ్రీ, వైస్ ప్రెసిడెంట్ ఎన్.హేమలత, ప్రధాన కార్యదర్శి కమాల్‌బీ, నారాయణ, సునీతలు డిమాండ్ చేశారు. కడప రిమ్స్ ఆవరణలో ఈ నెల 10న 'నర్సెస్ స్ట్రగుల్ కమిటీ'(ఎన్.ఎస్.సి) ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే దీక్షలు గురువారం మూడో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 14 సంవత్సరాలుగా రెగ్యులర్ నోటిఫికేషన్ ప్రకటించలేదన్నారు. జీఓ 115 ప్రకారం రెగ్యులర్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ స్టాఫ్ నర్సులుగా, కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులుగా పదోన్నతి కల్పిస్తూ ఖాళీ స్టాఫ్ నర్సుల ఉద్యోగాలను భర్తీ చేస్తున్నారన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలన్నారు. ఈ నెల 13వ తేదీ నుంచి 16వ తేదీ వరకు అత్యవసర విధులు మినహాయించి ఓపీ, సాధారణ వార్డు విధులు బహిష్కరిస్తామని తెలిపారు. ఈ నెల 17న రెండు గంటల పాటు అత్యవసర విధులను బహిష్కరిస్తామన్నారు. 18న రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక దీక్షలలో పాల్గొంటామన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న అర్బన్ సీఐ రాజగోపాల్

**బద్వేలు అర్బన్ :** గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు సభ్యుల ముఠాను అరెస్టు చేసి వారి వద్ద ఐదు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ రాజగోపాల్ తెలిపారు. స్థానిక అర్బన్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, అర్బన్ ఎస్‌ఐలు, చెన్నంపల్లె ఎస్టీకాలనీ సమీపంలోని కాశినాయన గుడి వద్ద తనిఖీలు నిర్వహించారన్నారు. గంజాయి విక్రయిస్తున్న బి.కోడూరు మండలానికి చెందిన ఓరుగంటినరసింహులు, అల్లూరి సీతారామరాజు జిల్లా జి.కె. వీధి మండలం వంతెవాండ్లపల్లె గ్రామానికి చెందిన గమ్మిల్ల కామేశ్వరరావు, మూర్లచంటిబాబు, బద్వేలు పట్టణం శివానగర్‌కు చెందిన పాదిలిరాంబాబు, గుంతపల్లెకు చెందిన తిరుపతిలను అరెస్టు చేసి వారి వద్ద రూ.35 వేల విలువ చేసే ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన కామేశ్వర్‌రావు, చంటిబాబుల ద్వారా గంజాయిని తెప్పించి పట్టణ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. సమావేశంలో అర్బన్ ఎస్‌ఐలు ఎం.సత్యనారాయణ, జె.రవికుమార్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## ముస్లింల ఆస్తులను అన్యాక్రాంతం కానివ్వం



శిబిరంలో మాట్లాడుతున్న ఆఫ్తాబ్

**రాయచోటి అర్బన్ :** ముస్లింలకు చెందిన వక్ఫ్ బోర్డు ఆస్తులను పరాధీనం చేస్తే సహించబోమని సహారా వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ఆఫ్తాబ్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ సహారా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం నాలుగు రోడ్ల కూడలిలోని జామియా మసీదు ఎదుట సంతకాల సేకరణ చేశారు. శిబిరంలో క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేసి వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ జాయింట్ పార్లమెంటరీ కమిటీకి ఫిర్యాదులను పంపారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆఫ్తాబ్ మాట్లాడుతూ వక్ఫ్ చట్టానికి ఎలాంటి సవరణలు అవసరం లేదని, ఉన్న చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో మూడు రాష్ట్రాలలో జరుగనున్న ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బీజేపీ పెద్దలు ఇలాంటి నల్ల చట్టాలను తెస్తున్నారంటూ మండిపడ్డారు.

### టౌన్ బ్యాంక్ చైర్మన్, మాజీ కౌన్సిలర్ మధ్య ఘర్షణ



ఘర్షణ పడుతున్న టౌన్ బ్యాంక్ చైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి, మాజీ కౌన్సిలర్ జయశంకర్

**ప్రొద్దుటూరు :** మున్సిపల్ కార్యాలయం ఆవరణలో గురువారం మధ్యాహ్నం టౌన్ బ్యాంక్ చైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి, మాజీ కౌన్సిలర్ జయశంకర్‌ల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఎగ్జిబిషన్ వేలం పాటకు వారు హాజరయ్యారు. వేలం అనంతరం బయటికి వెళుతుండగా ఇరువురి మధ్య మాటా మాటా పెరిగి ఘర్షణ పడ్డారు. నాయకులు సర్దిచెప్పి పంపేశారు.

### పసుపు రైతులకు శిక్షణ



పసుపు సాగు యాజమాన్యంపై బుక్‌లెట్లను ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు, రైతులు

**మైదుకూరు :** పసుపు సాగులో రైతులు పెట్టుబడి తగ్గించుకోవాలని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ పేర్కొన్నారు. మైదుకూరు కేవీకేలో నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణలో భాగంగా గురువారం పసుపు పంటపై రైతులకు శిక్షణ ఇచ్చారు. డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ విత్తన పసుపులో పెద్ద కొమ్ములను నాటకుండా కణుపు వద్ద తుంచడం ద్వారా, ఎకరాకు రెండు క్వింటాళ్ల విత్తన కొమ్ములను ఆదా చేయవచ్చని తెలిపారు. అనంతరం పసుపు సాగులో సమగ్ర యాజమాన్యం బుక్‌లెట్లను శాస్త్రవేత్తలు, రైతులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్రం విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీవిద్యారాణి, గృహ విజ్ఞాన శాస్త్రం శాస్త్రవేత్త డాక్టర్ బీఎస్.కాంతిశ్రీ, ఎఫ్‌పీఓ చైర్మన్ బాలనరసింహారెడ్డి, అభ్యుదయ రైతులు బాలయ్య, రామనందారెడ్డి, శివరామయ్య తదితరులు పాల్గొన్నారు.

### 30లోపు జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించాలి

**మదనపల్లె సిటీ :** జిల్లా స్కూల్స్ గేమ్స్ అండర్ –14, 17 బాల బాలికల జిల్లా స్థాయి పోటీలు ఈ నెల 30వతేదీ లోపు తప్పకుండా నిర్వహించాలని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వసంత తెలిపారు. డీఈఓ ఆదేశాల మేరకు మండల స్థాయిలో 15వతేదీ లోపు, నియోజకవర్గ స్థాయి పోటీలు 20వతేదీలోపు నిర్వహించాలని సూచించారు.

### లడ్డూ వేలం



లడ్డూ దక్కించుకున్న భక్తులు

**ప్రొద్దుటూరు కల్చరల్ :** స్థానిక వివేకానంద కాలనీలో శ్రీవరసిద్ధి వినాయక కమిటీ నిర్వాహకులు గురువారం లడ్డూ వేలం నిర్వహించారు. లడ్డూను సారుకోళ్ల నరేష్ యాదవ్ రూ.1.15 లక్షలు, వెండి కాయిన్‌ను గోరంట్ల శేఖర్‌యాదవ్ రూ.1.40 లక్షలు, నోట్ల హారాన్ని వెంకటసుబ్బరాయుడు, వెంకటరమణ యాదవ్ రూ.2.60లక్షలు, కలశం, వెండి చెంబు చిట్టిబోయిన గంగాధర్‌యాదవ్ రూ.1.70 లక్షలు, పెన్ను, పుస్తకం శిరివెల్లబాబు రూ.లక్షకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

### వివాహిత ఆత్మహత్యాయత్నం

**మదనపల్లె :** కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం రామసముద్రం మండలంలో జరిగింది. చెంబకూరు ఎగువ హరిజనవాడకు చెందిన మణి భార్య అరుణ(28) కుటుంబ సమస్యలతో భర్తతో గొడవపడింది. మనస్తాపం చెంది ఇంట్లోనే పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వ సర్వజన బోధనాసుపత్రికి తరలించారు.

### న్యాయ వ్యవస్థ గౌరవాన్ని నిలబెడదాం

**రాయచోటి టౌన్ :** భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయ వ్యవస్థ గౌరవాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత న్యాయవాదులు, న్యాయమూర్తులపై ఉందని రాయచోటి జిల్లా ఐదో న్యాయమూర్తి కృష్ణన్ కుట్టి అన్నారు. రాయచోటి కోర్టు ఛాంబర్‌లో బదిలీపై వెళ్తున్న రాయచోటి అడిషనల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ డాక్టర్ శారదకు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర వ్యవస్థలు తప్పు చేస్తే వాటి తప్పులు సరిదిద్దే స్థానంలో న్యాయ స్థానం ఉందని తెలిపారు. రాజ్యాంగం న్యాయవ్యవస్థకు ఉన్నత స్థానం కల్పించిందని, ప్రజలకు చట్టబద్ధ పాలన అందించడంతో ఇతర వ్యవస్థలు విఫలమవుతున్న సమయంలో న్యాయ వ్యవస్థ రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడే బాధ్యత తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి డాక్టర్ శారద, సీనియర్ సివిల్ జడ్జి ప్రసన్న, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆసీఫా సుల్తానా, రాయచోటి బార్ అసోషియేషన్ అధ్యక్షుడు ఎస్.ప్రభాకర్‌రెడ్డి, పి.రెడ్డెయ్య, డి.నాగముని, సిద్ధయ్య పాల్గొన్నారు.

### గోశాలకు పశువుల తరలింపు

**మదనపల్లె :** కబేళాకు పశువులను తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నట్లు తాలూకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. అనంతపురం నుంచి తమిళనాడుకు లారీలో పశువులను తీసుకెళ్తుండగా పట్టుకుని విచారించామని తెలిపారు. సరైన అనుమతి పత్రాలు లేకపోవడంతో లారీ డ్రైవర్, క్లీనర్లను అదుపులోకి తీసుకుని వాహనాన్ని సీజ్ చేశామన్నారు. అందులో 46 పశువులను గోశాలకు తరలించామన్నారు.